ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
సోమవారం 8 జూలై 2024



● ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ అమలు
● రవాణా చార్జీలు చెల్లింపు
● ప్రాంతాన్ని బట్టి టన్నుకో రేటు
● హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు, మధ్యతరగతి వర్గాలు

నేటి నుంచి ఉచిత ఇసుక

(కడప - ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో ఇసుక బంగారమైంది. 2019 మునుపు చంద్రబాబు హయాంలో ఇసుక ఉచితంగా ప్రభుత్వం ఇచ్చేది. అప్పట్లో భవన నిర్మాణాలకు భారం ఉండేది కాదు. ఎప్పుడైతే జగన్ సీఎం అయ్యాడో ఉచిత ఇసుకకు మంగళం పలికారు. కొత్త పాలసీ అంటూ కొన్ని నెలల పాటు ఇసుక లేకుండా తాత్సారం చేయడంతో నిర్మాణ రంగం కుదేలైంది. పనిలేక ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. రోజూ పెళ్లాం బిడ్డలతో భవన నిర్మాణ పనులకు వెళితే తప్ప ఐదు వేళ్లు నోట్లో పడని పరిస్థితి. ముఖ్యంగా కడప జిల్లాకు పొరుగున అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భవన నిర్మాణ కార్మికులు వలస వస్తుంటారు. అక్కడ కరువు కాటకాలు, ఉపాధి లేక కుటుంబ పోషణ బరువవుతుండడంతో అక్కడ కార్మికులు కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, బద్వేలు ఇతర ప్రాంతాలకు వచ్చి భవన నిర్మాణ పనుల్లో పాల్గొంటారు. అయితే జగన్ పాలనలో ఉచిత ఇసుకను రద్దు చేసి ఎంతో మంది పొట్ట కొట్టారు. కొన్ని నెలల పాటు ఇసుక పాలసీని రద్దు చేశారు. దీంతో ఎప్పుడూ లేని విధంగా ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఎంతలా అంటే కడపకు దగ్గరలోనే పెన్నా నది ఉంది. అయినప్పటికీ ఇక్కడ 18 టన్నులు టిప్పరు ఇసుక రూ.26 నుంచి 30వేల మధ్య అమ్మేశారు. దీంతో పెరిగిన ఇసుకధరలు భారంగా మారాయి. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే రాష్ట్రవ్యాప్తంగా సోమవారం (నేటి) నుంచి జిల్లాలో ఉచిత ఇసుక పథకం అమలులోకి రానుంది. దీంతో సొంతింటి సాకారం చేసుకోవాలన్న పేద, మధ్యతరగతి ఇతర ఉన్నత కుటుంబాలతో పాటు బిల్డర్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

చంద్రబాబు హామీ.. భవన నిర్మాణాలకు ఊతం

భవన నిర్మాణానికి పునాది ఎంత పటిష్టమో.. నిర్మాణంలో సిమెంటు, కంకర, ఇనుముతో పాటు ఇసుక కూడా ఎంతో ప్రధానం. అయితే జగన్ హయాంలో ఇసుక బంగారంలా మారింది. పాశ్చాత్య పోకడలతో జనంలో అభిరుచులు మారాయి. ఉమ్మడికుటుంబాలు కనుమరుగు అవుతున్నాయి. ఇండ్యూజవల్ ఇళ్లకే ప్రయార్టీ ఇస్తున్నారు. బ్యాంకులు, ఇతరత్రా వాటిలో గృహ నిర్మాణాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తుండడంతో గృహ నిర్మాణాల సంఖ్య పెరిగిపోతుంది. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, వేంపల్లె, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, కలసపాడు, చెన్నూరు, ఖాజీపేట, దువ్వూరు, చాపాడు, సీకేదిన్నె ప్రాంతాల్లో రియల్ భూం విస్తరిస్తోంది. ఈ ప్రాంతాల్లో భవన నిర్మాణాలు కూడా ఊపందుకోనున్నాయి. అయితే చాలా చోట్ల ఈ ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లలో స్థలాలు కొన్నారు కానీ కొందరు నిర్మాణ వ్యయానికి భయపడి నిర్మాణాలు జరపలేదు. అయితే ఉచిత ఇసుకతో ఈ ప్రాంతాల్లో నిర్మాణరంగం పుంజుకుంటుందని అంటున్నారు.

నేటి నుంచి ఉచిత ఇసుక

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోమవారం (నేటి)నుంచి ఉచిత ఇసుక జిల్లాలో అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం ఎటువంటి ఆదాయం తీసుకోకుండా కేవలం నిర్వహణ ఖర్చులు, సీనరేజ్ చార్జీలు వసూలు చేస్తుంది. జిల్లాలో 11 స్టాకు పాయింట్ల నుంచి ఇసుకను తీసుకోవచ్చు. ఉచిత ఇసుకను ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించడానికి సీఎం చంద్రబాబు జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎస్ఎస్‌సీ)ని ఏర్పాటు చేశారు. ఇందులో కమిటీ చైర్మన్‌గా కలెక్టరు, ఎస్పీ, జేసీ, ఆర్డీవో, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి, డీసీవో, డీటీసీ, జిల్లా గనులు, భూగర్భ వనరులశాఖ డీడీ మెంబరుగా ఉంటారు.

11 రీచ్‌లలో ఇసుక అమ్మకాలు..

జిల్లాలో 11 స్టాకు యార్డుల్లో ఇసుక నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. ఆయా స్టాకు యార్డులలో నుంచి రవాణా చార్జీలు నిర్ణయించారు. కొండాపురం మండలంలోని కె.వెంకటాపురం, బి.అనంతపురం స్టాకు యార్డ్‌ల నుంచి టన్నుకు రూ.340, కమలాపురం నుంచి రూ.341, సిద్దవటం మండలం జ్యోతి నుంచి రూ.140, బద్వేలులో రూ.468, పోరుమామిళ్లలో రూ.587, పెండ్లిమర్రి మండలంలోని పగడాలపల్లె, కొత్తూరులో రూ.340, వీఎన్‌పల్లె మండలంలో రూ.340, పులివెందులలో రూ.468, మైదుకూరులో టన్నుకు రూ.400లు చెల్లించాలి. దీంతో పాటు రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంది. ఈ రుసుము కూడా జిల్లా కలెక్టరు, గనులశాఖ అధికారి పేరిట సంయుక్తంగా తీసిన బ్యాంకు ఖాతా నెం:ఎస్‌బీఐ 4313104219-2, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ - ఎస్‌బీఐఎన్ 0011122, కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్‌కు చెల్లించాలి.

ఆధార్‌తో బుక్ చేసుకోవాలి..

ఇసుక కావాల్సిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ నెంబరుతో బుక్ చేసుకోవాలి. ప్రతి స్టాకు పాయింటులో భూగర్భ గనుల శాఖ రెవెన్యూ, పోలీసు అధికారులు ఇన్‌చార్జ్‌లగా వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీలు పనిచేస్తాయి. మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్ఐ, అదనపు మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు, ఇరిగేషన్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు కమిటీలో ఉంటారు. వీరి ఆధ్వర్యంలో రోజుకు 8గంటలు షిఫ్ట్‌లో 24గంటలు పనిచేస్తారు. ఇక పారదర్శక ఇసుక పంపిణీ కోసం స్టాకు పాయింట్లలో 24గంటల పోలీసు సెక్యూరిటీ ఉంటుంది. మొత్తానికైతే సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలో ఉచిత ఇసుకను నేటి నుంచి అమలు చేయడంతో ప్రజలకు భారం తగ్గనుంది. కడపలో మొన్నటి వరకు టిప్పరు ఇసుక 30 వేలకు మధ్య దొరికేది. అయితే చంద్రబాబు సీఎం అయిన తరువాత ఇసుక ధరలు తగ్గాయి. ఉచిత ఇసుక అని చెప్పుకొచ్చారు. ఇంకా అమలు కాలేదు. ఆదివారం కడప నగరంలోనే టిప్పర్ ఇసుక 16వేలకు దొరకగా ట్రాక్టరు రూ.4వేలకు అమ్మారు. నేటి నుంచి ఉచిత ఇసుక రావడంతో ధరలు తెలియాల్సి ఉంది.

జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే

● గతంలో జరిగిన ఘోరాలకు సంబంధం లేదని జగన్ చెప్పగలరా? ● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల టౌన్, జూలై 7: రాష్ట్రంలో జరిగిన ఘోరాలు, నేరాలకు ఎటువంటి సంబంధం లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇష్టదేవుడైన యేసుప్రభు మీద ప్రమాణం చేసి చెప్పాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పులివెందులలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. వేంపల్లెలో దాడికి గురైన వైసీపీ కార్యకర్తను పరామర్శించడానికి శనివారం కడప రిమ్స్‌కు వెళ్లిన సమయంలో జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అన్నారు. 1978 నుంచి రాజకీయాలు ప్రారంభించిన వైఎస్ కుటుంబ సభ్యులు ఏనాడు నేరాలకు పాల్పడలేదని వైఎస్ జగన్ చెప్పగలరా అన్నారు. 2005లో జరిగిన సహకార ఎన్నికల్లో చేయని తప్పులకు మాపై దాడులు చేసి అక్రమ కేసులు పెట్టింది వాస్తవం కాదా అన ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవం కాకుండా చేశామని సహకార ఎన్నికల్లో దాడులు చేశారన్నారు. ఆ దాడుల్లో పోలీస్ అధికారులతో సతీష్‌రెడ్డి గన్‌మెన్ బెదిరించి గన్ లాక్కుని కాల్చారని చెప్పించి అభం శుభం తలియని 16మందిపై కేసు పెట్టి జైలుకు పంపినది వాస్తవం కాదా అన్నారు. న్యాయ వ్యవస్థను కూడా ప్రభావితం చేసి చనిపోయిన వ్యక్తితో వేలిముద్ర వేయించుకొని మరణ వాంగ్మూలాన్ని మార్చడం జరిగిందని.. దీనిపై మెజిస్ట్రేట్ కాంతిమతిని 2012 డిసెంబరు 12న విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. వైఎస్ జగన్ పక్కనున్న సతీష్‌రెడ్డి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడూ ఘర్షణలకు పాల్పడలేదని చెబితే మేము క్షమాపణ చెప్తామన్నారు. గత ఐదేళ్లలో ప్రశ్నించిన వారిని, తప్పులను పత్రికల్లో రాసిన విలేకరులను, టీడీపీ కార్యకర్తలను హింసించి వేధించినది వాస్తవం కాదా అన్నారు. మధ్యాహ్న భోజనం పెట్టలేదని అవాకులు చవాకులు మాట్లాడటం పద్ధతి కాదని, పులివెందులకు వచ్చిన వైఎస్ జగన్ పాఠశాలలకు వెళ్లి పరిశీలించాలన్నారు. అలాగే జగన్ గాని, అవినాష్‌రెడ్డి గాని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని ఏనాడైన పరిశీలించారా అని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించడం మా కార్యకర్తలను పెట్టుకోవాలన్న ఉద్యోగ యావ తప్ప సంస్కరణల వైపు చూసిదే లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పులివెందులలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటిని యదావిధిగా కొనసాగించి పులివెందులను శాంతిముఖంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కార్యదర్శి మైసూరారెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నేరమంటే తెలియదని సతీష్‌రెడ్డి చెప్పగలరా? : బీటెక్ రవి



పులివెందుల టౌన్, జూలై 7: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నేరచరిత్ర తెలియదని సతీష్‌రెడ్డి చెప్పగలరా అని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రశ్నించారు. ఆదివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లెలో దాడి జరిగిన కొన్ని గంటల్లోనే నిందితులను అరెస్టు చేశారన్నారు. మేము పోలీసులతో మాట్లాడలేదు, దాడులను మేము ప్రోత్సహించం అన్నారు. అదే మీ హయాంలో జరిగిన ఘటనల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేవారన్నారు. అంతేకాకుండా నేరాలంటే తెలియనట్లు, వాళ్ల కుటుంబానికి నేరచరిత్రే లేదన్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వేంపల్లె పరిధిలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూతుల్లో ఎవరిని కూర్చోనివ్వకుండా తీవ్ర ప్రయత్నాలు చేశారని.. అయినా టీడీపీ కార్యకర్తలు ధైర్యంగా ఏజెంట్లుగా కూర్చున్నారన్నారు. పోలింగ్ బూత్‌ల్లో మా ఏజెంట్లను అవమానపరిచారని.. ఇలా అవమానపడిన వారు ఆ రకంగా చేయాల్సి వచ్చిందేమో అన్నారు. దాన్ని పట్టుకొని ఇలాంటి సాంప్రదాయం ఎప్పుడు లేదని జగన్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గతంలో విలేకరి నారాయణ గాని, నంద్యాలంపల్లె శివరామిరెడ్డి మర్డర్స్‌తో, పెద్దకుడాల కృష్ణారెడ్డి, పార్నపల్లెలో సూర్యనారాయణ ఇంటినిపేల్చడం ఇలా చెప్పుకొంటూ పోతే మీ రాజకీయ పునాదే ప్రజలను భయభ్రాంతులను చేసి పుట్టిందన్నారు. 2005లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులివెందుల నగరిగుట్టకు చెందిన ఇద్దరు పిల్లలను గొంతులు కోయడం వాస్తవం కాదా అన్నారు. ఈరోజు అమాయకుడు, పిల్లాడు అని చెబుతున్న జగన్‌మోహన్‌రెడ్డి వారు పిల్లలు కాదా అని ప్రశ్నించారు. వేంపల్లెలో దాడి మాత్రమే జరిగింది, మీది ఏకంగా గొంతులు కోసిన చరిత్ర అని విమర్శించారు. జగన్ మాట్లాడిన మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అలాగే జగన్ మాట్లాడుతుంటే పక్కనే ఓ పెద్దమనిషి ఉన్నారన్నారు. ఆ పెద్దమనిషికి 2005లో మాపై అక్రమ కేసులు పెట్టారు, జైల్లో పెట్టారని గుర్తులేదా అన్నారు. ఇందుకు కారణమైన వైఎస్ జగన్ గాని, రాజారెడ్డి గాని చాలా మంచోళ్లు అని ధైర్యంగా చెప్పగలవా అని ప్రశ్నించారు. నిన్ను పక్కన పెట్టుకొని మాట్లాడుతుంటే నీ బుద్ధి ఏమైంది అని సతీష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ జరిగిన సంఘటనకు చంద్రబాబునాయుడుకు ఏమైన సంబంధం ఉందా అని ప్రశ్నించారు. పులివెందులలో శాంతిభద్రతలకు ఎట్టిపరిస్థితుల్లో విఘాతం కలిగించమన్నారు. పులివెందుల అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. చౌకబారుమాటలు మానుకోవాలన్నారు.

కొత్త ఇసుక పాలసీతో స్థానిక సంస్థలు బలోపేతం

● ఆర్థికంగా పరిపుష్టి కానున్న పంచాయతీలు

కలికిరి, జూలై 7: జిల్లాలోని స్థానిక సంస్థలకు ప్రభుత్వం నుంచి ఒకటి రెండు రోజుల్లో శుభ వార్త రానుంది. ఐదేళ్లుగా ఆర్థికంగా నీరసించి నిర్వీర్యంగా మారిన గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు, జిల్లా పరిషత్‌లు ఆర్థిక పరిపుష్టి సాధించనున్నాయి. ఐదేళ్లలో మరుగునపడిన సీనరేజీ చార్జీల ద్వారా టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను పునరుజ్జీవింప చేయనుంది. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఇసుక పాలసీని పూర్తిగా స్థానిక సంస్థలకు ఆర్థికంగా దోహదం చేసేటట్లు రూపొందించిందని తెలియవచ్చింది. ఉచిత ఇసుక విధానం పేరుతో అమల్లోకి రానున్న దాంతో ప్రధానంగా స్థానిక సంస్థలకు భారీగా ఊరట లభించడమే కాకుండా ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఈ విధానం చేయూత ఇవ్వనుంది.

సీనరేజీ చార్జీలను జమ చేయని వైసీపీ ప్రభుత్వం

ఇసుక, గ్రానైట్, కంకర క్రషింగ్ వంటి వాటికి తప్పనిసరిగా సీనరేజీ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా వసూలు చేస్తుంది. ఇలా వసూలయ్యే మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం చివరగా జిల్లా పరిషత్తులకు బదిలీ చేయడం పరిపాటి. ఇందులో గ్రామ పంచాయతీల వాటా 50 శాతం, మండల పరిషత్తుల వాటాగా 25 శాతం, మరో 25 శాతం జిల్లా పరిషత్తులకు చెందుతాయి. మైనింగ్ కార్యక్రమాలు జరిగే పంచాయతీలకు మాత్రమే సీనరేజీ వాటా దక్కుతుంది. అదేవిధంగా ఏయే జిల్లాల్లో మైనింగ్ జరుగుతుందో ఆయా మండలాలకు, జడ్పీలకు మాత్రమే ఈ నిధులు వర్తిస్తాయి. ఇవేగాకుండా ఇసుక, కంకర, మట్టి ఉపయోగించి చేసే రహదార్లు, సీసీ రోడ్లు, చెరువుల మరమ్మతులు, ప్రాజెక్టుల నిర్మాణాలు ఇలాంటి అన్ని రకాల పనుల్లో నుంచి కూడా సీనరేజీ చార్జీలు ప్రభుత్వమే కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తుంది. ఇంజినీర్లు బిల్లులు తయారు చేసేటప్పుడే ఈ చార్జీలను తప్పనిసరిగా ఎస్టిమేట్లలోనే పొందుపరుస్తారు. ఇవి ఈ పనులు జరిగే గ్రామ పంచాయతీలు, మండలాలు, జడ్పీలకు దామాషా మేరకు జమవుతాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ పంచాయతీలోనూ ఇసుక, కంకర ఉపయోగించి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో ఆయా స్థానిక సంస్థలు కూడా సీనరేజీ చార్జీల విషయమే మర్చిపోయాయి. కాకపోతే ఈ ఐదేళ్లలో ప్రధానంగా ప్రభుత్వమే పెద్ద ఎత్తున ఇసుక వ్యాపారం నిర్వహించిన విషయం తెలిసిందే. అయినా సీనరేజీ చార్జీలను స్థానిక సంస్థలకు చెల్లించే ఆనవాయితీని మాత్రం పాటించలేదు. ఇసుక కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన ఈ సీనరేజీ చార్జీలు అసలు ఎక్కడ జమయ్యాయో కూడా తెలియని పరిస్థితి.

సీనరేజీ పేరుతో వసూలయ్యేదెంత?

ఇసుక, గ్రానైట్ మైనింగ్, కంకర క్రషింగ్ వంటి వాటి నుంచి ఎంత వసూలవుతుందో పరిశీలిస్తే గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎంత మేర ఎగ్గొట్టిందన్న విషయం కూడా అర్థమవుతుంది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం తాజా ఇసుక పాలసీలో ఇసుక ధర ఉచితం కాగా, కేవలం సీనరేజీ చార్జీల కోసం రూ.88 మాత్రం చెల్లించాల్సి ఉంటుంది. రూ.275గా నిర్ణయించి టన్నుకు రూ.88లు సీనరేజీ నిర్ణయించి స్థానిక సంస్థలకు జమ చేసేందుకు నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.475 వంతున విక్రయించారు. ఉదాహరణకు కలికిరి మండలంలో బాహుదా నది వెంబడి పారపట్ల, చీకటిపల్లె, పల్లవోలు, గుండ్లూరు, అద్దవారిపల్లె, మహల్ రీచ్‌లను గుర్తించి తవ్వకాలకు అనుమతించారు. గుండ్లూరు రీచ్ నుంచి 35 వేల క్యూబిక్ మీటర్ల (55 వేల టన్నులు) ఇసుకను తవ్వుకునేందుకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రకటించి న మేరకు టన్నుకు రూ.66 సీనరేజీ చార్జీలు లెక్కిస్తే రూ. 36 లక్షలు స్థానిక సంస్థలకు జమ కావాలి. కానీ ఇలా చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం దీనిని కూడా దారి మళ్లించినట్లు చెబుతున్నారు. ఇదే రీచ్‌లో 55 వేల టన్నులకు అనుమతులున్నా అన్ని రకాల 'వాల్టా' చట్టం నిబంధనలను ఉల్లంఘించి ఈ ఒక్క రీచ్ నుంచే 4 లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తోడేశారు. దీనిని కూడా లెక్కిస్తే మొత్తం దాదాపు రూ.2.50 కోట్లు సీనరేజీకి ఎగనామం పెట్టారు. ఒక రీచ్ పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన రీచ్‌లను లెక్కిస్తే అక్రమాలకు అంతే లేకుండా ఉందని చెబుతున్నారు.

ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్



కడప(కలెక్టరేట్) జూలై 7: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపు నిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌తో కలసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిల్వ కేంద్రాల్లో ఉన్న స్టాక్ యార్డ్ నుంచి ఇసుకను అందజేయాల్సి ఉందన్నారు. ఎటువంటి ఆదాయం తీసుకోకుండా నిర్వహణ ఖర్చులు, సీనరేజ్ వసూల్ చేసి వినియోగదారులకు అందజేయాలనేది ప్రభుత్వ ముఖ్యఉద్దేశ్యమన్నారు. నూతన ఇసుక విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, జేసీ, ఆర్డీవోలు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులుగా, డీపీవో, డీటీసీ తదితరులు సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లా గనులు, భూగర్భ వనరులశాఖ డిడి మెంబరు కన్వీనరుగా వ్యవహరిస్తారు. ప్రస్తు తం జిల్లాలో మొత్తం 11 స్టాక్ యార్డుల్లో సిద్ధంగా ఉన్న ఇసుకను ఆయా నిల్వ కేంద్రాల నుంచి ఇసుక కావాల్సిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు నెంబరుతో బుక్ చేసుకోవాలన్నారు.

ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు మండలస్థాయి కమిటీలను కలెక్టర్ నియమించారు. ఇందులో తహశీల్దారు, ఎంపీడీవో, స్టేషన్ హౌస్ ఆఫీసరు, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ ఏఈ, నీటిపారుదలశాఖ ఏఈలను నియమించారు. వీరి ఆధ్వర్యంలో రోజుకు 8 గంటల షిఫ్ట్ విధానంలో 24 గంటలు సూపర్ వైజర్లు స్టాక్ పాయింట్ల వద్ద విధులను నిర్వహించాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు 24 గంటల పాటు పోలీసు సెక్యూరిటీ, మండలస్థాయి బృందాలు పర్యేక్షణ ఉంటుందన్నారు. ఇసుక లోడింగ్‌కు సంబంధించి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండల సమాఖ్యకు ఇవ్వాలని.. ఇందుకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనందద్ నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇక ఇసుక పంపిణీని నిరంతరం పర్యేక్షించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబరు 08562-246344ను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు అసౌకర్యం కలిగితే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ సందీప్‌రెడ్డి, అదనపు ఎస్పీ సుధాకర్, ఏఎస్పీ వెంకటరమణ, డీఆర్వో గంగాధర్‌గౌడ్, భూగర్భగనులశాఖ ఇన్‌చార్జి డీడీ రవిప్రసాద్, డీటీసీ మీరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన దిశగా.. పాడా

● అక్రమాలపై ప్రభుత్వం దృష్టి ● రూ.వేలకోట్ల ఖర్చుపై ఆరా ● స్పెషల్ అధికారి బదిలీ ● కొత్త అధికారి బాధ్యతలు

పులివెందుల, జూలై 7: పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా)లో జరిగిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. పాడాకు జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్లు నిధులు కేటాయించింది. ఈ నిధులకు సంబంధించి అక్రమాలు జరిగాయని టీడీపీ గళం ఎత్తుతోంది. వేలకోట్లు ఎక్కడ ఖర్చు చేశారో, ఎక్కడ దుర్వినియోగం చేశారో నిగ్గు తేల్చాలని ఆ పార్టీ నాయకులు పట్టుపడుతున్నారు. ఇక్కడున్న స్పెషల్ అధికారి బదిలీ కావడం, కొత్త అధికారి బాధ్యతలు చేపట్టడం చూస్తుంటే ప్రక్షాళన వైపే అడుగులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

2019లో పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడంతో ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ (పాడా)ను ప్రత్యే కంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గంలో పాడా ద్వారా రూ.వేల కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. అందులో గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, పాఠశాల భవనాలు, గ్రామీణ రోడ్లు, పులివెందుల మోడల్ టౌన్‌లో పలు అభివృద్ధి పనులు, ఆర్టీసీ బస్టాండ్,పులివెందుల రింగురోడ్డు అభివృద్ధి తదితర పనులను చేపట్టారు. ఈ పనులకు వెచ్చించాల్సిన నిధుల కంటే అధిక మొత్తంలో కేటాయించి విడుదల చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడం.. జగన్ ముఖ్యమంత్రి పదవి కోల్పోవడం జరిగిపోయింది.

రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో పులివెందులలో పాడాను రద్దు చేయాల్సి ఉంది. గతంలో కూడా ఇదే పద్ధతి సాగింది. అందరూ అదే జరుగుతుందని ఊహించారు. కానీ ప్రస్తుతం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయినప్పటికీ ఇక్కడ పాడా రద్దుచేయకుండా కొనసాగిస్తున్నారు. ఇక్కడున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు రావడంతో ఆయన వెళ్లిపోయారు. ఆయన వెళ్తానే పాడా రద్దు అయినట్లేనని అందరు భావించారు. అయితే కడపలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.వెంకటరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన పాడా ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టారు. పాడా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాడా ఇంకా ఎందుకుకొనసాగుతోందని అనేక మందిలో అనుమానాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పాడాలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకే పాడా కొనసాగుతోందని స్పష్టమవుతోంది. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లోను, జగనన్న మెగా లేఅవుట్‌లోను పెద్దఎత్తున అవినీతి జరిగిందని, వాటిని నిగ్గుతేల్చేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందున్న ఓఎస్డీని బదిలీ చేసి కొత్త అధికారిని నియమించారు. ఏదిఏమైన టీడీపీ పులివెందులలో సాగిన అభివృద్ధి పనులలో జరిగిన అక్రమాలు వెలికి తీసేందుకు అడుగులు వేస్తోందన్నది నగ్నసత్యం.

ప్రైవేటు స్థలంలో ప్రభుత్వ బోరు.. పంచాయతీకి బిల్లు!

● చిలమకూరులో నిబంధనలకు తిలోదకాలు ● రూ.27,42,250 బకాయిలు తేల్చిన డీఎల్‌పీఓ ● ఎంపీటీసీ ఫిర్యాదుతో వెలుగుచూస్తున్న నిజాలు ● నీటి వ్యాపారంపై నిలదీస్తున్న కూటమి నేతలు

ఎర్రగుంట్ల, జూలై 7: మండలంలోని మేజర్ పంచాయతీ చిలమకూరులో మరో విద్యుత్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. చిలమకూరులో పంచాయతీలో అవినీతి, అక్రమాలపై బీజేపీ ఎంపీటీసీ నవీన్ కుమార్ 2021లో కలెక్టర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో డీపీఓ ఆదేశాల మేరకు కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలి విచారణ చేస్తున్నారు. పంచాయతీలో ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న ఆవుల రామకృష్ణ స్థలంలో ప్రభుత్వ అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అధికారులు బోరు వేయగా పంచాయతీ పేరుతో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఎంపీటీసీ నవీన్‌కుమార్‌తో, కూటమి నేతలు బి.బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డితో డీఎల్‌పీఓ బుధవారం బోరును పరిశీలించారు. అది ప్రైవేటు స్థలంగా నిర్ధారించారు.

విధిలేకే : డీఎల్‌పీఓ మస్తాన్‌వలి

ప్రైవేట్ స్థలాల్లో ప్రభుత్వ బోరు వేయకూడదు. అందులోనూ పంచాయతీలో ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అయితే నీటి ఎద్దడి ఉన్న దృష్ట్యా విధిలేని పరిస్థితిలో అక్కడ బోరు వేశారు. ఆ వ్యక్తి స్థలాన్ని పంచాయతీకి రాయించుకోలేదు. ప్రభుత్వ విద్యుత్ మీటర్ బిగించారు. దానికి ప్రస్తుతం రూ.27,42,250 బకాయిలున్నట్లు తెలిసింది. ఇదే బోరు నుంచి ట్యాంకర్లతో గ్రామం లోని ప్రజలకు నీటిని సరఫరా చేసి బిల్లులు చేసుకున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి చెక్కులను కూడా ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం. అయితే ఇదే మోటార్ నుంచి కొన్ని వీధులకు డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెబుతున్నారు. వాటిపై కూడా పూర్తిస్థాయిలో విచారిస్తాం. ఉన్నది ఉన్నట్లుగా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఎంపీటీసీ అడిగిన పనులన్నింటి వివరాలు ఇచ్చాం. వారికి ఎక్కడ అనుమానం ఉన్నా వాటిని పరిశీలించి నిజానిజాలు తేలుస్తాం.




బోరువేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ - బకాయిపడిన విద్యుత్ బిల్లులు

వ్యాపారం చేశారు: ఎంపీటీసీ నవీన్‌కుమార్

ఎన్‌ఎంఆర్‌గా పనిచేస్తున్న ఆవుల రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా సొంత స్థలంలో ప్రభుత్వ బోరు వేయించుకున్నారు. ఆ బోరుకు మోటార్ అమర్చి ప్రభుత్వ మీటర్ ద్వారా చిలమకూరు సహా ఇతర చోట్లకు కూడా ట్యాంకర్లతో వ్యాపారం చేశాడు. ఆయన భార్య పేరుతో పనులు చేసి పంచాయతీ చెక్కుల ద్వారా బ్యాంకుల్లో నిధులు జమచేసుకున్నారు. వీటిపై అధికారులు నిజానిజాలు తేల్చాలి. ఆ బోరుకు రూ.27,42,250 బకాయిలున్నట్లు విద్యుత్ అధికారులు బిల్లులు చూపించారు. ఆదాయం తక్కువగా ఉన్న ఇంత చిన్న పంచాయతీకి అంత భారీ మొత్తంలో విద్యుత్ బిలులు వచ్చాయంటే ఎంతటి అక్రమాలు జరిగాయే తెలుస్తోంది. గ్రామంలో చేసిన అన్ని పనులపై తాము విచారణ చేస్తున్నాము. పనులు చేయకుండా నిధులు దుర్వినియోగం చేసిన విషయాన్ని త్వరలో అధికారులను తీసుకెళ్లి చూపిస్తాం.

చర్యలు తీసుకోవాలి : కూటమి నేతలు

చిలమకూరులో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు బాలవెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి అధికారుల ను కోరారు. వారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన స్థలంలో బోరు వేసుకుని 0032260 నెంబరుతో ప్రభుత్వ మీటరును ఏర్పాటు చేసుకుని పంచాయతీలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా నీటి వ్యాపారం చేశారని ఆరోపించారు. వీటిన్ని విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐసీఎల్ నిధులు గోల్‌మాల్

చిలమకూరు ఐసీఎల్ వారు పంచాయతీకి సీఎస్ఆర్ ద్వారా ఇచ్చిన నిధులు కూడా దుర్వినియోగమైనట్లుఆరోపణలు చేశారు. అధికా రులు ఐసీఎల్ వారిని నివేదిక కోరగా వారికి సరైన సమాధానం ఇవ్వలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర గ్రామాలకు ఇచ్చిన వాటిని, గ్రామంలో మెడికల్ క్యాంపుల గురించి మాత్రమే ఇచ్చినట్లు ఎంపీటీసీ ఆరోపించారు. వీటన్నింటిపై మళ్లీ విచారించాలని అధికారులను డిమాండ్ చేశారు. చిలమకూరులో తవ్వేకొద్దీ అక్రమాలు బయట పడుతున్నట్లు అధికారులు సైతం వివరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ బకాయిలు రూ.4.40లక్షల విషయం మరవక ముందే మరో విద్యుత్ బకాయి బయటపడడం ఆశ్చర్యానికి గురిస్తోందని వారు ఆరోపించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● పలువురికి తీవ్రగాయాలు



డ్రైవర్ సాహిల్ మృతదేహం

దువ్వూరు (మైదుకూరు), జూలై 7 : వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దాల్లో ముగ్గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు హైదరాబాదు నుంచి తిరుపతికి వెళ్తున్న కంటైనర్ లారీని దువ్వూరు బైపాస్ రోడ్డులో వెనుకనుంచి మినీలారీ ఢీకొనడంతో మినీ లారీ డ్రైవర్ సాహిల్ (42)తో పాటు కుందన్, విశాల్ గాయపడ్డారు. వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిం చగా హైదరాబాదుకు చెందిన సాహిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని..



మృతిచెందిన వీరయ్య

చాపాడు, జూలై 7: మండలంలోని పల్లవోలు, నాగులపల్లె బస్టాపుల మధ్య జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండు వీరయ్య (60) అనే వృద్ధుడు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరయ్య తన సొంత గ్రామం అయిన నాగులపల్లె నుంచి టీవీఎస్ వాహనంపై చాపాడు గ్రామానికి వస్తుండగా ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కారు ఢీకొని స్కూటరిస్టు..



మృతి చెందిన చెన్నయ్య

మైదుకూరు, జూలై 7 : కారు ఢీ కొనడంతో బైక్ పై వెళతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు... కాశీనాయన మండలం అంబవరానికి చెందిన సోమిరెడ్డిపల్లె చెన్నయ్య (73) తన కూతురిని చూసేందుకు ద్విచక్ర వాహనంలో కడపకు వెళతుండగా మండలంలోని వనిపెంట వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు

మైదుకూరు, జూలై 7 : ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆళ్ళగడ్డ నుంచి మైదుకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును, ప్రొద్దుటూరు నుంచి నెల్లూరు వెళ్తాన్న లారీ ఆదివారం సాయంత్రం పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు తగిలాయి. కాగా మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు



పట్టుబడిన ట్రాక్టరు

పోరుమామిళ్ల, జూలై 7 : రెవెన్యూ అధికారుల అనుమతి లేకండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శిరీషా హెచ్చరించారు. ఆదివారం కొందరు ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయం తహసీల్దారు దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు ఆర్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బందితో వెళ్లి నాగేంద్ర అనేవ్యక్తికి చెందిన ట్రాక్టరును సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయంలో ఉంచారు. అనుమతి లేకుండా గ్రావెల్ తరలించడానికి ప్రయత్నిస్తే ఎంతటి వారిపైనా ఉపేక్షించే ప్రసక్తిలేదని ఆమె తెలిపారు.

కొండూరుకు చేరిన పెంచలయ్య మృతదేహం



పెంచలయ్య మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు

అట్లూరు, జూలై 7 : అట్లూరు మండలం కొండూరు గ్రామానికి చెందిన పెంచల య్య గురువారం తెల్లవారు జామున కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. అ క్కడే ఉన్న ఆయన ఇద్దరు కుమారులు, బంధువుల సహాయంతో పెంచలయ్య మృతదేహన్ని శనివారం రాత్రికి వారి సొంత ఊరు కొండూరుకు తీసుకువచ్చారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

హైకోర్టు జూనియర్ స్టాండింగ్ కోచ్‌గా పోరుమామిళ్లవాసి



రావుల నాగార్జున

పోరుమామిళ్ల, జూలై 7 : హైకోర్టు జూనియర్ స్టాండింగ్ కోచ్‌గా పోరుమామిళ్ల వాసి రావుల నాగార్జున నియమితులయ్యారు. పోరుమామిళ్ల చెందిన రావుల వెంకట సుబ్బమ్మ మనవడు రావుల పెద్ద నాగేశ్వర్‌రావు - పద్మా వతి కుమారుడు హైకోర్టు ది సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్ డైరెక్టు యాక్సెస్ ఇన్ ద కస్టమ్స్ (సీబీఐసీ) డిపార్ట్ మెంటు తరపున వాదనలు వినిపించేందుకు నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవనం నుంచి ఈ నెల 4న ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోరుమామిళ్లలో ప్రైవే టు స్కూలులో ఇంగ్లిషు మీడియంలో విద్యాభ్యాసం చేసి న అనంతరం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళా శాలలో న్యాయశాస్త్రం పూర్తి చేశారు. 2021-22 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్‌కు ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎన్నికయ్యారు. ఆయన నియామకంపై పోరుమామిళ్లవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవినీతిలో భాగస్వాములైతే.. చర్యలు తప్పవు

● జగనన్న లేఅవుట్లలో ఇసుక స్కాంపై విచారణ

● హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య

ప్రొద్దుటూరు , జూలై 7 : ప్రొద్దుటూరు రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలకు ఇసుక రవాణాలో రెండు కోట్ల మేర స్కాం జరిగినట్లు ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వచ్చిన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ కథనంపై ఆరా తీసి నివేదిక సమర్పించాలని హౌసింగ్ పీడీ కృష్ణయ్యను ఆదేశించారు. దీంతో కడప హౌసింగ్ ఈఈ హుస్సేనప్పను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి జూలై 10 లోపుగా విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు పీడీ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆదివారం ఆయన ఫోన్ ద్వారా వివరాలు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎంతటి వారున్నా చర్యలు తప్పవని హె చ్చరించారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఇసుక కూపన్ల స్కానింగ్ పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. కానీ డీఈ ఇస్తున్న నివేదికలకు ఏఈలు ఇస్తున్న రిపోర్టులకు తేడాలున్నాయన్నారు. జగనన్న లేఅవుట్‌లకు జేపీ వెంచర్స్‌వారు ఇసుక రవాణా చేయకనే ఇన్ వాయిస్‌లు ఆన్‌లైన్‌లో ఎవరు అప్‌లోడ్ చేశారు. తేదీల వారీగా రికార్డుల ను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. రవాణా చేసిన ఇసుక, ఇళ్ళ నిర్మా ణంలో వాడిన ఇసుక పరిమాణానికి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఇచ్చే కూపన్లకు తేడాలెందుకు వస్తున్నాయన్న అంశం పరిశీలించాల్సి ఉందన్నారు కాగా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఒక కూపన్‌కు 5 టన్నుల ఇసుక వాడుకున్నట్లు రికార్డుల్లో నమోదు చేయాలి. ఆ మేరకు ఇళ్ల నిర్మాణం ఎంత జరిగింది. ఎన్ని ఇళ్లు నిర్మించారు. అసలు నిర్మాణం జరగకున్నా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎందుకు ఇసుక కూపన్‌లు ఇచ్చారు.. ఎందుకు హౌసింగ్ ఏఈలు వారిపై ఒత్తిడి పెంచుతున్నారన్నది తేలాల్సి ఉంది. కానీ నెపం ఒకరిపై వేసి, అసలు నిందితులు తప్పించుకోవాలని చేయని ప్రయత్నం లేదు. ఈఈ రాజారత్నంకు ఇచ్చిన నివేదిక ప్రకారం దాదాపు 37 వేల మెట్రిక్ టన్నుల మేరకు తేడాలను గుర్తించారు. ఆ తేడాలు ఇన్ని నెలలు గడుస్తున్నా ఇంతకాలం ఎందుకు కప్పిపుచ్చుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్ల పరిగెడు తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తప్పని పరిస్థితుల్లో విచారణ అధికారిని నియమిస్తూ హౌసింగ్ పీడీ ఉత్తర్వులు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే అదే శాఖకు చెందిన కడప ఈఈని విచారణా ధికారిగా నియమించడంతో ఇక్కడి అధికారులు ఆయనను ప్రభావితం చేయరన్న గ్యారెంటీ లేదు. రెవెన్యూ అధికారులనో, ఇతర శాఖ అధికారుల నో విచారణ అధికారిగా నియమించి పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం వుంది. ప్రొద్దుటూరులో డీఈ ఇస్తున్న నివేదికలు అనేక అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఈఈ రాజారత్నం ముగ్గురు ఏఈలకు మాత్రమే షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇంకా వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్రపై కూడా విచారణ జరగాల్సి ఉంది.. అయితే రిపోర్టుల్లో తేడాలున్నా ఏఈలకు అనుకూలంగా డీఈ ఎందుకు రిపోర్టులు ఇస్తున్నాడన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇందులో డివిజన్ అధికారులు, సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా అన్ని కోణాల్లో విచారణ జరిగేలా చర్యలు తీసుకోకుంటే విచారణ తూతూ మంత్రంగా మారే అవకాశాలున్నాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక స్కాంపై ముఖ్యమంత్రి ఫిర్యాదు

ఇసుక స్కాంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో వున్న అధికారులతో ఈ స్కాం బయటికి రాదని, వారిని మార్చి వేరే అధికారులతో నిష్పక్షపాతంగా విచారణ చేయించాలని ఆయన కోరనున్నారు. జగనన్న లేఅవుట్‌లో కాంట్రాక్టర్ల పేర కొందరు వైసీపీ నేతలు ఇళ్ళ నిర్మాణాలు చేస్తామని లబ్ధిదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో వీటన్నింటిపై విచారణ జరిపించాలని కోరనున్నారు. టిడ్కో ఇళ్లు కూలగొట్టి, ఎంఐజీ లేఅవుట్ డెవలప్‌మెంట్ పేర అనుడా అధికారులు చేసిన పనులు, ఆగమేఘాలపై మంజూరు చేయించుకున్న బిల్లులపై అనుడా అధికారులపై విచారణ చేయాలని ఆయన కోరనున్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన



పులివెందుల శిల్పారామంలో ప్రదర్శన ఇస్తున్న ఇంద్రజాలికుడు హరేరామ్ జాదూగర్

పులివెందుల రూరల్, జూలై 7: పులివెందుల శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. నంది అవార్డు గ్రహీత, జాదూ కళారత్న, ఇంద్రజాల తేజంఅవార్డు గ్రహీత, రాయలసీమ ప్రముఖ ఇంద్రజాల ప్రదర్శకుడు హరే రామ్ జాదూగర్ ఈ ప్రదర్శన ఇచ్చినట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పావురాలు తీయడం, కోడిగుడ్లు నోట్లో వేసుకొని చేతులలో నుంచి తీయడం, ప్లెయిన్ పేపర్‌ని డబ్బులుగా మార్చడం, రింగులు నుంచి రింగులు తీయడం తదితర ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శన సందర్శకులను మంత్రముగ్దులను చేసింది. కార్యక్రమాన్ని విజయంతం చేసిన సందర్శకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజా అవసరాలకు ఇసుకను అందుబాటులో ఉంచాలి'



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

సిద్దవటం, జూలై 7: ప్రజా అవసరాలకు ఇసుకను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తహసీల్దారు మురషావలి, మండల అధికారులకు సూచించారు. సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామంలోని పెన్నానదిలో ఇసుక రీచ్‌ను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్ వద్ద 24 గంటలు సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. జ్యోతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద నీరు నిలుస్తున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా 10 రోజుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, తహసీల్దారు, ఎంపీడీవోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న, ఏపీఎం వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనురాధా తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం మహిళ పోరాటం

● కూతుళ్లతో కలసి భర్త ఇంటి ముందు ఆందోళన

బద్వేలుటౌన్, జులై 7 : అగ్నిసాక్షిగా తాళికట్టి 7 అడుగులు నడిచి ఈ జన్మంతా నీకు తోడుగా ఉంటానంటూ ప్రమాణం చేసి.. ఇద్దరు కూతుళ్లు పుట్టిన తరువాత ఇంటినుంచి గెంటేశాడంటూ ఓ మహిళ న్యాయ పోరాటం ప్రారంభించింది. తనకు న్యాయం చేయాలం టూ కూతుళ్లతో కలసి ఆదివారం భర్త ఇంటి ముందు దీక్ష ప్రారంభించింది. వివరాల్లోకి వెళితే బద్వేలు పట్టణంలోని కోటవీధికి చెందిన కళ్యాణ్, అబ్బరాతివీధికి చెందిన లక్ష్మీప్రసన్నకు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు కూతుళ్లున్నారు. అయితే ఇంట్లో చిన్న చిన్న గొడవలు జరగడంతో ఇరువరి మధ్య సఖ్యతలేక దూరమయ్యారు. ఐదేళ్ల క్రితం భర్త వదిలేయడంతో లక్ష్మీ ప్రసన్న కడపలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేసుకుంటోంది. తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేయడంతో కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు ధర్నా ప్రారంభించింది.

ఎమ్మెల్యే పుట్టా చొరవతో సాగునీటి సమస్య పరిష్కారం



కాలువ వద్ద గుమికూడిన సుంకేసుల గ్రామస్థులు

ఖాజీపేట, జూలై 7: వ్యవసాయంపై నేతల చిన్నచూపు కారణంగా సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పాటు, కాలువలు ఆక్రమణకు గురి కాగా, ప్రస్తుత శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకుని కాలువల మరమ్మతు పనులు వేగవంతం చేశారని సుంకేసుల గ్రామస్థులు అన్నారు. ఆదివారం సబ్‌స్టేషన్ సమీపంలోని కాలువ వద్ద సుంకేసుల గ్రామస్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్కిలేరు కాలువ కింద సుంకేసుల, బీచువారిపల్లె గ్రామాల్లో దాదాపు 700 ఎకరాలకు నీరు అందుతుందని, వైసీపీ ప్రభుత్వహయాంలో ఈ కాలువలు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సుంకేసుల గ్రామానికి వచ్చినప్పుడు వక్కిలేరు నుంచి పొలాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరడంతో గెలిచిన వెంటనే పనులు పూర్తి చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఖాజీపేట, జూలై 7: పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణుల్లో అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వి.మల్లేష్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తనెల్లూరు ఎస్సీ కాలనీని పరిశీలించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆ గ్రామంలో డాక్టర్ ముబిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉండడంతోపాటు, తాగునీరు కలుషితమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు రాత్రివేళల్లో దోమతెరలు వాడాలని తెలిపారు. . గ్రామంలో అతిసార లేదని, కొద్దిమందికి జ్వరాలు వస్తున్నాయని, వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. పరిసరాల్లో నీరు నిలువ ఉన్నా, వ్యక్తిగత శుభ్రత పాటించకపోయినా రోగాల బారిన పడక తప్పదన్నారు. వైద్యుల సలహాలు పాటించగలిగితే జ్వరాలను అదుపులోకి తీసుకురావచ్చన్నారు. జిల్లా ఎపిడియాలజిస్టు ఖాజామొదీన్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులపై గ్రామంలో అవగాహన కల్పిస్తామన్నారు. వేడిగా ఉండగానే భోజనం చేయడంతో పాటు, నీటిని కాచి చల్లార్చి వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రామసుబ్బారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, కొత్తపేట సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఘర్షణ



సర్దిచెబుతున్న పోలీసులు

ఖాజీపేట, జూలై 7: ఆస్తి పంపకాల విషయంలో మండల పరిధిలోని నరసన్‌ఖాన్‌పేటకు చెందిన బషీర్, జాఫర్ ఆదివారం ఘర్షణ పడ్డారు. తరచూ వారు ఘర్షణ పడుతుండడంతో, గ్రామస్థులు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు రంగప్రవేశం చేసి ఘర్షణను నివారించారు. పోలీసులు సరైన సమయానికి స్పందించడంపై గ్రామస్థులు అభినందించారు.

యువకుడి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, జూలై 7: పట్టణంలోని నాజ్ హాల్ సమీపంలో అబ్దుల్ రహీం (22) అనే యువకుడు ఆదివారం దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. గున్నిగుంట్ల రోడ్డు సమీపంలోని గుర్రాలకుంటలో మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటికి తీసుకెళ్లారు. అయితే, తన కుమారుడిని ఎవరో హత్య చేశారని అబ్దుల్ రహీం తండ్రి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

రోజూ మద్యం తాగి వేధిస్తున్నాడన్న కారణంతో కుటుంబ సభ్యులే గొంతుకోసి హత్య చేసి ఉంటారని మృతుడి తండ్రితో పాటు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

విద్యావలంటీర్లను నియమించాలి: ఎస్టీయూ

కడప (ఎడ్యుకేషన్), జూలై 7: జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించేందుకు అవకాశం లేనందున విద్యావలంటీర్లను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం డీఎస్సీ ద్వారా వచ్చే డిసెంబరులో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టనుందని, అప్పటి వరకు పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల స్థానంలో వలంటీర్లను నియమించాలన్నారు. రాష్ట్రంలో అనేక ఉపాధ్యాయ ఖాళీలు పదవీ విరమణ ద్వారా ఏర్పడ్డాయన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు అవసరం ఉన్నందున సర్దుబాటు కష్టంగా ఉందని నూతన ఉపాధ్యాయులు వచ్చే వరకు ఇంగ్లీషు మీడియంలో అర్హత కలిగిన వారిని నియమించినట్లయితే బోధనకు ఆటంకం లేకుండా ఉంటుందన్నారు.

'విభజన అంశాలపై సీఎంల చర్చలు హర్షణీయం'

కడప (మారుతీనగర్), జూలై 7: విభజన అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్-తెలంగాణ) ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి చర్చలు జరపడం మిక్కిలి హర్షణీయమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం దేశంలోనే అత్యంత ఆదాయ నగరంగా అభివృద్ధి చెందినదంటే ఆంధ్ర పాలకులు, ప్రజల వల్లే అనే సంగతి గుర్తెరగాలన్నారు. కాగా ఉమ్మడి ఆస్తులు, బకాయిలపై చర్చించాల్సింది పోయి విభజన అంశాలలో లేని తిరుమల-తిరుపతి దేవస్థానంలో వాటా కావాలని, హైదరాబాద్‌లోని ఆంధ్రా భవనాలను అప్పగించమనడం సహేతుకంగా లేదన్నారు. అంతేకాకుండా శ్రీశైలం జలాశయం నుంచి 511 టీఎంసీల నీటి వాటా కావాలని, పైపెచ్చు పోలవరం ప్రాజెక్ట్ కింద ఉన్న ఏడు మండలాలను ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ లెక్కన హైదరాబాద్ నగరం నుంచి వచ్చే ఆదాయంలో ఆంధ్రాకు వాటాతో పాటు తెలంగాణ పరిశ్రమల్లో వాటా ఆంధ్రా కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రం విడిపోయి తెలంగాణ నుంచి 16వేల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోవడంతో పాటు రాజధాని లేని రాష్ట్రంగా ఇక్కడి ప్రజలు భరిస్తున్నారన్నారు.

ఉనికి కోసమే జగన్ ప్రజాదర్బార్: టీఎన్ఎస్ఎఫ్


మాట్లాడుతున్న తిరుమలేశు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 7 : గడిచిన ఐదు సంవత్సరాల అధికారంలో ఒక్కసారి కూడా ప్రజాదర్బార్ నిర్వహించని మాజీ ముఖ్యమంత్రి జగన్ అధికారం కోల్పోగానే ఉనికి కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. ఆదివారం కడప నగరం టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు అధికారంలోకి ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ప్రజల సమస్యలు కానీ, సమగ్ర అభివృద్ధి కానీ పట్టించుకోలేదన్నారు. అడపాదడపా జరిపే పర్యటనలో కూడా ప్రజలను దగ్గరకు రానీయకుండా పరదాల చాటున పర్యటనలు ముగించుకునేవారన్నారు. జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ ప్రతిపక్ష నాయకులను, ప్రజాసంఘాల నేతలను ముందస్తు అరెస్టుల పేరుతో నిర్బంధించేవారన్నారు. ఐదు సంవత్సరాలు అధికారంలో ఒక్కసారి కూడా ప్రజాదర్బార్ నిర్వహించని జగన్ అధికారం కోల్పోగానే కడప జిల్లా ప్రజలు గుర్తుకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నంత కాలం ఆదాయం, అవినీతి ఆక్రమణలు, దౌర్జన్యాలు, దాడుల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేనందుకే ప్రజలు ఓడించారన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అనిల్, ఏటూరు లోకేశ్, విశ్వనాథ్, శ్రీనివాసులు, ఫరీద్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మృతి


నాగేశ్వరరెడ్డి (ఫైల్)

పులివెందుల టౌన్, జూలై 7: కడప జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరెడ్డి(44) మృతిచెందారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు టీడీపీ శ్రేణులు తెలిపాయి. పులివెందుల మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లెకు చెందిన నాగేశ్వరరెడ్డి టీడీపీకి ఎనలేని సేవ చేశారన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

- సమస్యల పరిష్కారానికి ముందుంటా
- ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి


చిన్నిక్రిష్టారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, జూలై 7: 'ఇటీవల జరిగిన ఎన్నికల్లో నా కోసం శ్రమించి మంచి మెజార్టీ తెప్పించిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటానని, వారి కోసం ఏ సమయంలో పిలిచినా వస్తానని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో ఆదివారం టీడీపీ సీనియర్ నేత చిన్నిక్రిష్టారెడ్డి ఏర్పాటు చేసిన విందుభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఆయన తండ్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు తన కోసం రేయింబవళ్లు కష్టపడ్డారని, వారి రుణం ఎంత చేసినా తీర్చుకోలేనిదన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామ పంచాయతీలు, వార్డులపై దృష్టి సారించి ఏ చిన్నసమస్య కూడా వదలకుండా పరిష్కరించడమే ధ్యేయమన్నారు. టీడీపీకి కార్యకర్తలే అండ అన్నారు. కొండపేట గ్రామంలో మంచి మెజార్టీ రావడానికి కారణమైన చిన్నిక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ మన్యం మోహన్‌రెడ్డి, ఆర్.సుధాకర్‌రెడ్డి, సంజీవ్‌పవన్‌తో పాటు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఎంతో కష్టపడ్డారని, వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు అన్నారు. ఎంతో మంది మాజీ సర్పంచ్‌లు, బలిజ సంఘం నేతలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తన కోసం కష్టపడ్డారని, వారికి సహకరిస్తానన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నేత చంద్ర సతీమణి మేల్లేశ్వరి పక్షవాతంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నిక్రిష్నారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, ఖాజాహుసేన్, ఆకుల చలపతి, మాజీ సర్పంచ్ జింకా సుబ్బరాయుడు, ఖాసింపీరా, సీనియర్ నేతలు సునీల్, బాషు, సాదక్, వల్లి , మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు దశల వారీ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 7:సీఎం చంద్రబాబునాయుడు మద్దతుతో మూడోసారి అధికారాన్ని చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ కడపలో ఉక్కు పరిశ్రమ లాంటి విభజన హామీలు అమలు కోసం కృషి చేయాలని ఇందుకోసం దశల వారీ పోరాటానికి సమాయత్తమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. ఆదివారం ఆ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని, సీఎంలు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశాయన్నారు. జగన్ అధికారంలోకి వచ్చినా రైతులకు కార్మికులకు ఏమీ ఒరిగిందిలేదన్నారు. విభజన హామీల అమలుకు దశల వారీ పోరాటం చేస్తామని అన్నారు.

వంద శాతం సబ్సిడీతో పండ్లతోటలు పెంచుకోవచ్చు : ఏపీఓ

వల్లూరు, జూలై 7 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద చిన్నకారు రైతులు వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చని ఏపీఓ సుధారాణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉపాధి హామీలో హార్టికల్చర్, ఇతర ప్లాంటేషన్ పనుల పురోగతిలో భాగంగా జిల్లాలో ఈ పండ్లతోటల పెంపకం చేపట్టాలన్నారు. ఈ పథకం ద్వారా ఐదెకరాలు లేదా అంత కన్నా తక్కువ భూమి కలిగి ఉన్న చిన్న, సన్న కారు రెతులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా నూరు శాతం సబ్సిడీతో పండ్లతోటలు పెంచుకోవచ్చన్నారు. ఈ నెల 20లోగా హార్టికల్చర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇందులో మామిడి, చీనీ, సన్న నిమ్మ వంటి పండ్లతోటలు నాటుకుంటే మూడేళ్లపాటు ప్రభుత్వం ద్వారా వందశాతం చార్జీలు అందిస్తార న్నారు. అలాగే మునగతోటలు నాటుకునే రైతులకు ఈ అవకాశం ఉంటుందని అన్నారు. కావున అర్హత కలిగి ఆసక్తి గల రైతులువల్లూరు మండలంలోని ఉపాధి హామీ కార్యాలయం సంప్రదించాలన్నారు. వారు వచ్చే ముందు వారి ఉపాధి జాబ్‌కార్డు, భూమి పట్టాదారుపాస్‌పుస్తకం నకలు, 1బి, సన్న చిన్నకారు రైతు పత్రం, జాబ్‌కార్డులో ఉన్నవారి ఆధార్ జిరాక్స్‌లు వారి బ్యాంకు అకౌంట్లను తీసుకురావాలన్నారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గం

వేంపల్లె, జూలై 7: వేంపల్లె మానవత నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం స్థానిక శ్రీచైతన్య హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. మానవత ఫౌండర్, రాష్ట్ర కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఎన్. రామచంద్రారెడ్డి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. రీజనల్ చైర్మన్ చల్లాబాలాజీ, అధ్యక్షులు పోతిరెడ్డి శ్రాణ్‌కుమార్ కార్యదర్శి శివకుమార్, కోశాధికారి శ్రీకళ, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ.యోగేశ్వర్‌బాబు, రక్తనిధి డైరెక్టర్ ఎస్.డి. సమీర్, సహాయ కార్యదర్శి తేజ, ఈసీ అవేర్‌నెస్ దేవిరెడ్డ శశేంద్రకుమార్‌రెడ్డి, ఈసీ ఎడ్యుకేషన్ కొండూరు చైతన్యకుమార్, ఈసీ హెల్త్ డాక్టర్ కె. అరుణ్‌కుమార్, ఈసీ ఎమెర్జెన్సీస్ పి.సుభాష్‌బాబు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వ్యవస్థాపకులు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల శాఖ శాశ్వత చైర్మన్ చక్రపాణిరెడ్డి, కోచైర్మన్ కావలి తేజ, జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ అవటాల రామాంజులరెడ్డి, కేంద్ర డైరెక్టర్ రాటాల గోపి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



సీకేదిన్నె, జూలై 7: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చి చల్లంగ చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందుభోజనాలు ఆరగించారు.

గంధం మోహన్‌కు ఎమ్మెల్యే పరామర్శ


సరోజమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

సీకేదిన్నె, జూలై 7: మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం మోహన్‌బాబు కుటుంబాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆదివారం పరామర్శించారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంధం మోహన్‌బాబు తల్లి సరోజమ్మ శనివారం సాయంత్రం మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మోహన్‌బాబును వారి కుటుంబ సభ్యులను అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించి ఓదార్చారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి క్రిష్టారెడ్డి, వీరకుమార్‌రెడ్డి మండల వ్యాప్తంగానే కాక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కలెక్టరేట్‌లో కలియ తిరిగిన కలెక్టర్


కలెక్టరేట్‌లో పలు సెక్షన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 7: కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల కార్యాలయాలతో పాటు వివిధ శాఖల కార్యాలయాలను కలెక్టర్ లోతేటి శివశంకర్ విజిట్ చేశారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఏయే శాఖలు ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి కలెక్టరేట్ అంతా కలియ తిరిగారు.

ఇన్‌చార్జి అధికారుల పాలనతో మూతపడుతున్న కార్యాలయాలు

వేముల, జూలై 7: మండలంలోని పలు కార్యాలయాలు ఇన్‌చార్జి అధికారుల కారణంగా మూతపడుతున్నాయి. వ్యవసాయ కార్యాలయానికి రెగ్యులర్ అధికారి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళాస్వయం సహాయకసంఘ కార్యాలయానిక ఏపీఎం లేకపోవడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని మహిళా సంఘాలు వాపోతున్నాయి. పశువైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో పశువులు, గొర్రెలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని కాపరులు వాపోతున్నారు. విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ లేకపోవడంతో ఇబ్బంది అవుతోందన్నారు.


వైభవంగా రతనాల వేంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7:పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రతనాల వేంకటేశ్వరస్వామి, స్వామివారిచెల్లెలు లలితాదేవికి పూజలు చేశారు.

144 జీఓను రద్దు చేయాలని కలెక్టర్‌కు వినతి

కడప (మారుతీనగర్), జూలై 7: బుడగజంగాల పురోగతికి శాపంగా మారిన 144 జీఓను రద్దుచేసేలా చూడాలని బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు దూపం రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ శివశంకర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. కులవృత్తి, భిక్షాటనకే పరిమితమై పిల్లలకు ఎస్సీ సర్టిఫికెట్లు అందక పాఠశాలలకు పంపించుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. ముఖ్యంగా కుల సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు రాక చదువుకున్నా ఉద్యోగాలు పొందలేక తీవ్ర మానసిక క్షోభకు గురై పవులూరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ కోటా కింద ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలతో పాటు మా పిల్లలు పాఠశాలల్లో చేరే సమయంలో గతంలో ఇచ్చిన ఎస్సీ సర్టిఫికెట్లు చెల్లేలా కృషిచేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు సురేష్, కళ్యాణ్, లక్ష్మి, గణేష్, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల కార్యదర్శిగా తులసినాయుడు



వీరపునాయునిపల్లె, జూలై 7: భారతీయ జనతా పార్టీ మండల కార్యదర్శిగా గంగినేని తులసినాయుడు నియమితులయ్యారు. ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు వేశ్వరయాదవ్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. పార్టీ కోసం ఇటీవల జరిగిన కూటమి అభ్యర్థుల కోసం కృషి చేశారు. అభ్యర్థుల వెంటే ఉంటూ పార్టీ గెలుపునకు నిరంతరాయంగా కృషిచేశారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు, కార్యకర్తలు,కూటమి నాయకులు అభినందించారు.

'టీడీపీ జిల్లా అధ్యక్షుడిపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 7: టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై కొంత మంది అబద్ధపు ప్రచారాలు చేయడం దుర్మార్గమని, ఇలాంటివి మానుకోవాలని టీ డీపీ నాయకుడు అఫ్సర్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పొలిట్‌బ్యూ రో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అందరి కోసం పనిచేస్తారని, కులమతాల తారతమ్యం లేకుండా అందరి సమస్యలు ఓపికతో విని సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. రాజకీయ, సామాజిక లబ్ధి కోసం ఇలాంటి దుష్ప్రచారం సబబు కాదని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు

కడప(కలెక్టరేట్), జూలై 7: ఏపీ జేఏసీ వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్ ఆదివారం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిసి పూలకుండి అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు కిరణ్ తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి


మృతుడు హుస్సేన్‌బాషా

చెన్నూరు, జూలై7: మండల పరిధిలోని రూకవారిపల్లె సమీ పంలో వ్యవసాయ బావిలో పడి హుస్సేన్‌బాషా(27) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడప నగరం పాలెంపల్లెకు చెందిన హుస్సేన్‌బాషా స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేసేవాడు. మద్యానికి బానిసై ఆదివారం మద్యం సేవించి రాజంపేట రోడ్డు వైపు నడుకుంటూ వస్తూ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి లో పడ్డాడు. స్థానికులు గమనించి అతన్ని బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిన దండోరా ఉద్యమం

- ఘనంగా ఎమ్మార్పీఎస్ 30 వసంతాల ఆవిర్భావ దినోత్సవం


ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేస్తున్న నరసింహ మాదిగ

కమలాపురం రూరల్, జూలై 7 : అణగారిన వర్గాల్లో చైతన్యం నింపింది దండోరా ఉద్యమమేనని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహ మాదిగ తెలిపారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందక్రిష్ణమాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి ఏబీసీడీ వర్గీకరణ లక్ష్యం కోసం గత 30 సంవత్సరాలుగా నడిపిన సుదీర్ఘమైన ఉద్యమ చరిత్ర భారత దేశంలో ఒక ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. దివ్యాంగుల పింఛను రూ.3వేల నుంచి రూ.6వేల వరకు పెంచడం క్రిష్ణమాదిగ పోరాట ఫలితమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు సి.ప్రసాద్‌మాదిగ, కమలాపురం మండల అధ్యక్షుడు కోడిగండ్ల భాస్కర్ మాదిగ, కమలాపురం నియోజకవర్గ అధ్యక్షులు పక్కిరిగాండ్ల సుబ్బరాయుడు, కమలాపురం మండల నాయకులు షేక్ షరీఫ్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ఎంఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగల న్యాయమైన హక్కుల సాధనే ధ్యేయం

- ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో మాతయ్యబాబు



కడప నగరంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాతయ్యబాబు తదితరులు

కడప (మారుతీనగర్), జూలై 7: మాదిగల న్యాయమైన హక్కుల సాధనే ధ్యేయమని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్యబాబు అన్నారు. ఎమ్మార్పీఎస్ ఏర్పాటై 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మాతయ్యబాబు ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ సమీప మహావీర్ సర్కిల్ వద్ద కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యంత వెనుకబడిన మాదిగజాతి పురోగతితో పాటు ఎవరికీ హానీ తలపెట్టలేని దివ్యాంగుల న్యాయమైన హక్కుల సాధనకోసం గత 30 సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్)ను మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేశారని మాతయ్యబాబు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగజాతి అభివృద్ధి చెందుతుందనే విశ్వాసంతో గత 30 సంవత్సరాలుగా మందకృష్ణ పిలుపు మేరకు అలుపెరుగని ఉద్యమాలు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, అణచివేత ధోరణి కారణంగా ఉద్యమపోరులో పలువురు అశువులు బాసినప్పటికీ ఉద్యమాన్ని మాత్రం ఆపలేదన్నారు. అలాగే సమాజంలో ఒక భాగమైన దివ్యాంగుల న్యాయమైన హక్కుల సాధన కోసం సైతం, నెలవారి పెన్షన్ పెంపుదల కోసం గతంలో మందకృష్ణ పోరు సాగించారన్నారు. దీంతో దివ్యాంగుల పెన్షన్‌ను నాటి పాలకులు పెంచారన్నారు. అదే స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరు సాగిస్తామని హెచ్చరించారు.

ర్యాలీకి వీహెచ్‌పీఎస్ సంఘీభావం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముందుగా కలెక్టరేట్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు నిర్వహించిన మాదిగల, దివ్యాంగుల ర్యాలీకి వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యపోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పలువురు దివ్యాంగులు త్రిచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుంపలగట్టు మాతయ్య, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత, మంజుల, నాయకులు ప్రసాద్, నాగయ్య, లలిత, ప్రేమలత, తులసి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పందులు బాబోయ్...



మైదుకూరు రూరల్ జూలై 7 : మైదుకూరు మున్సిపాలిటీలో నానాటికీ పందుల స్వైర విహారం ఎక్కువైపోతోందని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని చెబుతున్నారు.పట్టణంలో ఎక్కడ చూసినా పందులు గుంపులు, గుంపులుగా ఉన్నాయని అటు వైపుగా వెళ్లాళంటేనే హడలిపోతున్నామని పలువురు చెబుతున్నారు. మైదుకూరు పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి అప్‌గ్రేడ్ అయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం పందుల విహారంపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.పందులు చెత్తకుండీల వద్దకు వెళ్లి చెత్త,చెదారాలను క్రిందకు లాగివేస్తుండటంతో విరివిగా దోమలు వృద్ధి చెంది, రోగాలు వస్తున్నాయని తెలుపుతున్నారు. పందుల తాకిడికి పిల్లలు కూడా వీధుల్లో నడవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పందుల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

పోరుమామిళ్ల, జూలై 7 : జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన లబ్ధిదారులకు నష్టపరిహారం అందకుండా రెవెన్యూ కార్యాలయంలో ఇద్దరు దళారీల అవతారం ఎత్తి లబ్ధిదారులను భయభ్రాంతులను చేస్తున్నారని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, పేరమ్మగారిపల్లె, సిద్దవరం, టేకూరుపేట గ్రామాల మీదుగా బెంగళూరు- విజయవాడ వెళ్లే జాతీయ రహదారి నిర్మాణం కోసం 2007లో భూసంస్కరణ చేశారన్నారు. ఇందులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అప్పటి రాజంపేట ఆర్డీవో చేతన్‌ఘార్గ్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. దీన్ని అదనుగా చేసుకున్న పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయంలో ఇద్దరు అధికారులు దళారుల పాత్ర పోషించారన్నారు. భూములు కోల్పోయిన రైతులలో ఎక్కువ భాగం దళితులు ఉన్నారని వీరిని బెదిరించి నష్టపరిహారం కాజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారన్నారు. కొంత మందితో ఆ ఇద్దరు రెవెన్యూ అధికారులు ఇవన్నీ ఏర్పాటు చేసుకుని లక్షకు 20వేలు,30వేలు లంచం ఇస్తేనే అకౌంటులో డబ్బులు పడతాయని లేదంటే డబ్బులు పడవన్న రీతిలో రైతులకు చెబుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బి.కోడూరు సీపీఐసహాయ కార్యదర్శి కేశవ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ ఒక వరం



గజమాలతో శ్రీనివాసులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, బంధుమిత్రులు

బద్వేలుటౌన్, జులై 7 : ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ ఒక వరంలాంటిదని ఎంఈవో చెన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పదవీవిరమణ చేసిన సందర్భంగా ఆదివారం నెల్లూరురోడ్డులోని నాగభూషణం కళ్యాణమండపంలో తోటి ఉపాధ్యాయులు, బంధువులు, ఆత్మీయుల సమక్షంలో అభినందన సత్కార వీడ్కోలు సభలో శ్రీనివాసులు, సుశీలమ్మను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని తమ దైవంగా భావించి నిరాడంబరంగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాధికారి జయప్రకాష్, గానుగపెంట హనుమంతరావు, సుబ్బరాయుడు, యూటీఎఫ్ విజయ్‌కుమార్, డాక్టర్ శర్వన్, డాక్టర్ వర్షిత, డాక్టర్ క్రిష్ణవేణి, డాక్టర్ భరద్వాజ్‌క్రిష్ణ, సుశీల, వర్షిణి, క్రిష్ణయ్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఖాజీపేట, జూలై 7: మండల సర్వసభ్య సమావేశం 9వ తేదీ రెండు గంటలకు ఉంటుందని ఎంపీడీవో ఎంవీ రమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరుగడంతో ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశం ఆలస్యమైందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతారన్నారు.

ఏటూరు వద్ద నాకాబందీ

ఖాజీపేట, జూలై 7: అక్రమంగా ఎర్రచందనం తరలిపోతోందని దానినినివారించేందుకు ఖాజీపేట మండలం ఏటూరు వద్ద ఫారెస్టు అధికారులు నాకాబందీ నిర్వహించిన్నట్లు ఫారెస్టు రవి తెలిపారు. శనివారం రాత్రి ప్రతి వాహనాన్ని పరిశీలించామన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే చందనం అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. కొత్త వ్యక్తులు ఫారెస్టు ల్యాండ్‌లో తిరుగుతున్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7: అమృతానగర్ వాసులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో అమృతానగర్‌వాసులు ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి విన్నవించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో రెండు విడతలుగా 2,500 మందికి ఇళ్లస్థలాలు కేటాయించారన్నారు. 15 సంవత్సరాలుగా వారికి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. అమృతానగర్‌వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

- గ్రామాల్లో డ్రైనేజీ శుభ్రతలు ప్రకటనలకే పరిమితమా
- ప్లాస్టిక్ వ్యర్థాలతో స్థానికుల ఇబ్బందులు
- శుభ్రతకు స్పందించని గ్రామ పంచాయతీలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు

జమ్మలమడుగు, జూలై 7: జమ్మలమడుగు మండలంలో శుభ్రత కరువైంది. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో,లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు దర్శనమిస్తోంది. జమ్మలమడుగు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు ఉన్నప్పటికీ శుభ్రత లేదని, కొన్ని చోట్ల రోడ్ల పక్కన గుంతలలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కంపుకొడుతున్నాయి. గత నెలలో జిల్లాలో పలుచోట్ల అపరిశుభ్రత కారణంగా డయేరియా వ్యాప్తి చెందిందని, ఆఘమేఘాల మీద జిల్లా అధికారులు అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో, పట్టణాల్లో డ్రైనేజీ వ్యర్థాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటి నుంచి అధికారులు గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు కానీ, రోడ్డుకు ఇరువైపులా చెత్త నిలువ ఉన్న ప్రాంతాలను కానీ శుభ్రత పాటించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు మూలన పడ్డాయి. పారిశుధ్య కార్మికులు కొన్ని చోట్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి వ్యర్థాలను తీసుకెళ్లే సిబ్బంది పది రోజుల నుంచి 13 రోజులలోపు చెత్త సేకరణకు వెళుతున్నట్లుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. మరికొందరు ఉపాధి హామీ పథకంలో సైతం పనులకు వెళ్లి చెత్తసేకరణ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంబందిత అధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా ప్రజలు చెప్పుకుంటున్నారు.



మోరగుడి పంచాయతీ కార్యాలయం చుట్టూ ముళ్లపొదలు

అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ కాలువలు కంపుకొడుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోవడంలేదని గ్రామాల్లో డ్రైనేజీ శుభ్రతలు అధికారుల ప్రకటనలకే పరిమితంగా మారిందని ఆరోపణలున్నాయి. వ్యర్థాలు ఇంటి ముందు డ్రైనేజీ కాలువల్లో కుళ్లిపోతున్నా స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇలా ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలు రావా అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోరగుడి , శ్రీరాములపేట, తదితర వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు ప్లాస్టిక్‌పై నియంత్రణకు చర్యలు లేకపోవడం వల్లనే ఎక్కడ చూసినా పారిశుధ్య కార్మికులకు వాహనం నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని తెలుస్తోంది. ఇటీవల మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు ర్యాలీ నిర్వహించారు. శుభ్రత పాటించాలని ఇంటి ఆవరణాల్లో నీటి నిలువలు లేకుండా పరిశుభ్రత ఉండాలని సూచించారు. కానీ గ్రామ పంచాయతీ అధికారులు, ఇతర గ్రామాల్లోని అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



డ్రైనేజీ కాలువలో వ్యర్థాల కంపు

నిరంతర సేవలో మానవత సంస్థ



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రామాంజనేయరెడ్డి

ఎర్రగుంట్ల, జూలై 7: అభాగ్యులకు నిరంతర సేవలందించడంలో అందరికి మార్గదర్శిగా మానవత సంస్థ నిలుస్తుందని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2024-25 నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక గౌతం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నగర పంచాయతీ కమిషనర్ రామక్రిష్ణయ్య, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ రఘురామిరెడ్డి, నూతన అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, విశిష్ట సేవలందించిన పాత కార్యవర్గాన్ని సన్మానించారు.

అమ్మవారికి బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ఖాజీపేట, జూలై 7: కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లికి మహిళలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం మండల పరిధిలోని పుల్లూరు హరిజనవాడలో సంవత్సరం క్రితం గంగమ్మ తల్లికి దేవాలయం నిర్మించారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మైదుకూరు, జూలై 7 : ఎమ్మార్పీయస్ 30వ వసంతోత్సవం, వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలను ఆదివారం మైదుకూరు వేడుకలు నిర్వహించారు. స్థానిక జోసప్‌పేటలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కైపు బాస్కర్, కేఎస్ రాజు,బాలాజీ, ఓబన్న,బాలారాజు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆదివారం నాయకులు జెండాను ఎగుర వేశారు. జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, మండల నాయకులు నాగన్న, నాగరాజు, ఓబయ్య పాల్గొని జెండా ఎగురవేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదినాన్ని .జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, పెద్ద ఓబులేసు, లక్ష్మీనారాయణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అలాగే పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు నాలుగురోడ్ల కూడలిలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు రంగనాయకులు, మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రతాప్, ఉదయబాస్కర్, నరసింహులు, గురయ్య, నాగిపోగు ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం, మందక్రిష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకుని బి.కోడూరు గ్రామంలో జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైఖ్య జాతీయ కోర్ కమిటీ సభ్యులు దేవదానం మాదిగ, మాదిగ ఉద్యోగుల జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ మాదిగ, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో ఆదివారం ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం, మందక్రిష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు జంగాల మునిస్వామి, ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌నేతలు పాల్గొన్నారు.

అలాగే పాత బస్టాండులో దండోరా జెండాను కేక్ కట్ చేసి ఎగురవేశారు. సమత దళిత్ యునైటెడ్ కమిటీ అధ్యక్షుడు సైమన్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సింగరయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచికెబాబు, వై.చిన్నయ్య, చంద్రకుమార్, పుట్టారవి, దస్తగిరి, బుడగజంగం నాయకులు నల్లప్ప, సీపీఐ నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయులు రాజకీయంగా రాణించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7: పద్మశాలీయులు రాజకీయంగా రాణించాలని పద్మశాలీయ సంఘం రాయలసీమ అధ్యక్షుడు కొంగతి లక్ష్మీనారాయణ, అఖిల భారత పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షుడు వద్ది నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం పద్మశాలీయ కల్యాణ మండపంలో రాయలసీమ పద్మశాలీయ సంఘం సమావేశం నిర్వహించారు. ఒంటిమిట్టలో పద్మశాలీయుల నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని సూచించారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామన్న హామీని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం పద్మశాలీయ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా గునిశెట్టి సునంద, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడుగా డాక్టర్ మునిరాంప్రసాద్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలీయ సంఘం కార్యదర్శి నందం లక్ష్మణ్‌కుమార్, ఓబుళపతి, ధనుంజయరావు, కోస్తా ఆంధ్ర పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, కన్వీనర్ బీమునిపల్లె వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నా వెంకటకృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరువ వెంకటనరసింహమూర్తి, పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, మేరువ పెంచలయ్య, బోగా ఆనంద్, సురేష్, జానకీరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలీయ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా గునిశెట్టి సునందకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

వైభవంగా రతనాల వేంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7: పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రతనాల వేంకటేశ్వరస్వామి, స్వామివారిచెల్లెలు లలితాదేవి అమ్మవార్లకు విశేష పూజలు చేసి అలంకరించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి సుముహూర్తంలో వేద పండితులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు నేత్రపర్వంగా స్వామివారి కల్యాణం తిలకించారు. స్వామివారి కల్యాణం తిలకించడం వలన కలిగే శుభాలను భక్తులకు వివరించారు. భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, హాజరైన భక్తులు

పండ్లతోటలసాగుకు దరఖాస్తుచేసుకోండి

కాశినాయన,జూలై7: రైతులకు ఉపాధిహామీ పథకంకింద 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలు సాగుచేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పిం చిందని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి,ఉపాధి ఏపీవో జయరామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల సన్న,చిన్నకారు రైతులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈపథకం కింద మామిడి,జామ,సపోట,సన్ననిమ్మ, చీనీ,డ్రాగన్‌ఫ్రూట్,నేరేడు తదితర పండ్లతోటలు సాగుచేసుకోవచ్చునన్నారు. చెట్లునాటుకున్న రైతులకు 3సంవత్సరాలపాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే ఇస్తుందన్నారు. పూర్తివివరాలకు నర్సాపురంలోని ఉపాధిహామీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పోరుమామిళ్ల..: ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఏపీవో రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. కుటుంబానికి ఐదెకరాలు లేదా అంత కంటే తక్కువ భూమి కలిగి చిన్నసన్నకారు రైతులంద రికీ ఈ పథకానికి అర్హులన్నారు. మామిడి, చీనీ, సన్ననిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్, ఆపిల్ వంటి పండ్లతోటలు నాటుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. మూడుసంవత్సరాలపాటు ప్రభుత్వం ద్వారా నూరు శాతం ఉచితంగా నిర్వహణ ఛార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. రోజా, మల్లెతోటలు నాటుకునే రైతులకు రెండు సంవత్సరాల నిర్వహణ ఛార్జీలు లభిస్తాయ న్నారు. మునగ తోటలు నాటుకునే రైతులకు రెండుసంవత్సరాల నిర్వహణ ఛార్జీలు, అదే విధంగా నర్సరీలు ఏర్పాటు చేసుకుని మొక్కలు పెంచి ఉపాధి హామీ నాటుకునే రైతులకు సరఫరా చేసినట్లయితే వారికి మూడు నెలల పాటు మొక్కలు పెంచిన ఛార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులు పోరుమామిళ్ల ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జాబ్‌కార్డు, భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు వంటి చిన్న,సన్నకారు రైతు పథకం, జాబ్‌కార్డులు ఉన్నవారి ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు.

వాహనాల తనిఖీలు



పోరుమామిళ్ల, జూలై 7 : ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడానికి డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి, సెక్షన్ ఆఫీసరు రమణ టీంగా ఏర్పడి విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనం తనిఖీ చేసి పరిశీలించారు చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రేంజ్ పరిధిలోని అధికారులకు టీంగా ఏర్పరచి ఎర్రచందనం పాత ముద్దాయిలను బెయిలుపై ఉన్న నేరస్తులు వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. మరలా వారు నేరాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పీడీ యాక్టు నమోదు చేయవలసి ఉంటుందని హెచ్చరించారు.

బకాయిలపై శ్వేత పత్రం ప్రకటించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రీజినల్ కన్వీనర్ సలీం, రషీద్‌ఖాన్, రమణారెడ్డి, ఇలియాస్‌బాష, సుబ్రహణ్యం, సంజీవరెడ్డి, ఓబుళరెడ్డి, శ్రీను, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్‌పాయింట్లను పరిశీలించిన ఆర్డీవో



కొండాపురం మండలం పి.అనంతపురం వద్ద స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు

కొండాపురం, జూలై 7: మండలంలోని పి.అనంత పురం, కె.వెంకటా పురం వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను జమ్మల మడుగు ఆర్డీవో శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు.చంద్రబాబు ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో మండలంలో ఈ రెండు చోట్ల స్టాక్‌పాయింట్లను కేటాయించారు. స్టాక్ వివరాలను ఆర్డీవో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను సరఫరా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగా టన్ను ఇసుక రూ.340(లోడింగ్ ఛార్జీలు కలిపి) చొప్పున వసూలు చేయనున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు.సోమవారం నుంచి ఇసుక కావలసిన వారు ఎంపీడీవో ఆఫీసులో సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐ ఆనందరావు సిబ్బంది పాల్గొన్నారు.